క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



కృష్ణను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ఉపాధ్యాయుడు గుగ్గులోతు కృష్ణను శుక్రవారం ఏలూరు విజన్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు జె.రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫాదర్ జి.మోజస్, అవినాష్ రాజు చుక్క, బోణం వెంకట రమణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కృష్ణ ఉపాధ్యాయునిగా విద్యారంగంలోనూ, సామాజిక రంగంలోనూ స్వచ్ఛందంగా గత 28 ఏళ్లుగా చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ సెక్రటరీ అనిల్ కుమార్ ట్రెజరర్ ఎస్ బాబి, ఎ.శేషు కుమార్, సీహెచ్ పావని తదితరులు పాల్గొన్నారు.

వాహనం బహూకరణ



వాహనం బహూకరిస్తున్న దాతలు

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామానికి చెందిన దాత దీపక్ నెక్స్‌జెన్ కంపెనీ చైర్మన్ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం జేఅండ్‌జే కరుణోదయ మానసిక వికలాంగుల పాఠశాల (వంగురు)కు వాహనం బహూకరించారు. మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, మానవత సంస్థ చైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ నిర్వాహకులు మానసిక వికలాంగులకు మెరుగైన రవాణా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ మానసిక వికలాంగుల సంస్థ చైర్మన్ కరస్పాండెంట్ డోమ్నిక్, సేవా సంస్థ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేతర అజయ్ బాబు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీపై హర్షం

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీ చేయడంతో మాదిగ జాతి చిరకాల ఆకాంక్ష నెరవేరిందని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 16న గవర్నర్ ఆమోదం పొందిన ఈ బిల్లు 17న న్యాయశాఖ ఆర్డినెన్స్–2 ఆఫ్ 2025 జారీ చేసిందని తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- క్లీన్ ఏలూరు.. గ్రీన్ ఏలూరు ప్రచారానికే పరిమితం
- నగరంలో స్వాగతిస్తున్న చెత్త కుప్పలు

ఏలూరు (టూటౌన్): ఏ రోడ్డు చూసినా ఏముంది గర్వకారణం.. సమస్తం చెత్త కుప్పలు, వ్యర్థాలమయం అన్న చందంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధి రోడ్లలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు పనికిరాని వస్తువులు, వ్యర్థాలను రోడ్ల పక్కగా కుప్పలుగా పడేస్తున్నారు. చెత్త కుప్పలు పందులు, పందికొక్కులకు ఆవాసాలుగా మారుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడంతో నగరంలో పారిశుద్ధ్యం మరింత అధ్వానంగా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రద్దీగా ఉండే ఎస్ఆర్‌పేటలో ఏ రోడ్డులో చూసినా చెత్త కుప్పలే దర్శనం

ఏలూరు టూటౌన్ పరిధిలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎస్ఆర్‌పేట ఒకటి. ఈ ప్రాంతంలో అత్యధికంగా విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు ఉన్నాయి. దీంతో నిత్యం వేలాది మంది విద్యార్థులు, ప్రజలు ఈ ఏరియాకు వచ్చి పోతుంటారు. ఎస్ఆర్‌పేటలో ప్రతి రోడ్డులోనూ ఏదో ఒక చోట చెత్త కుప్ప దర్శనమిస్తుంది. ప్రతి నిత్యం చెత్తను తరలించే కార్యక్రమం చేపడుతున్నా చెత్త ఎక్కువగా ఉందనే కారణంతో కొద్దికొద్దిగా వదిలివేయడం కన్పిస్తుంది. ఈ చెత్తను పందులు, పందుకొక్కులు చిందర వందర చేసి రోడ్డుపైకి లాక్కొచ్చేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది.



ఎస్ఆర్‌పేట వార్డు సచివాలయం రోడ్డులోని చెత్త వద్ద సంచరిస్తున్న పందులు



ఎస్ఆర్‌పేట కళాశాల రోడ్డులో పేరుకుపోయిన చెత్త



ఓవర్ బ్రిడ్జి కింద ఆర్అండ్‌బీ ఆఫీసుల వెనుక రోడ్డులో చెత్తకుప్ప

ప్రచార ఆర్భాటంగానే క్లీన్, గ్రీన్ ఏలూరు కార్యక్రమం

ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడో శనివారం నగరంలో ఏదో ఒక ప్రాంతంలో క్లీన్ ఏలూరు, గ్రీన్ ఏలూరు పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇదంతా ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదనే విమర్శలు వస్తున్నాయి. నెలలో ఒక రోజు ఆర్భాటంగా కాకుండా ప్రతి రోజూ పారిశుద్ధ్య కార్మికులతో సక్రమంగా చెత్తను తరలించే కార్యక్రమం, డ్రెయిన్లు క్లీన్ చేసే కార్యక్రమం నిర్వహిస్తేనే ఏలూరు క్లీన్‌గా మారుతుందని ప్రజలు సూచిస్తున్నారు.

ఆటోల రద్దుతోనే సమస్య



గత ఫిబ్రవరి నుంచి నగరంలోని చెత్తను ఎప్పటికప్పుడు తరలించే చెత్త ఆటోలను (క్లాప్ ఆటోలు) రద్దు చేశారు. దీంతో ఏలూరు నగరంలో పారిశుద్ధ్య సమస్య అధికమైంది. తొలగించిన వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడమూ ఒక కారణమే. సాక్షాత్తు అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌చార్జిగా ఉన్న ఏలూరు టూటౌన్ ప్రాంతంలో పారిశుద్ధ్యం మరీ విద్దూరంగా ఉంది.

– డీఎన్‌వీడీ ప్రసాద్, నగర కార్యదర్శి, సీపీఎం

చెత్త తరలింపులో నిర్లక్ష్యం



ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని చెత్తను ఏరోజు కారోజు తరలించే విషయంలో నిర్లక్ష్యం తగదు. ప్రతి రోజూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలి. తక్షణం ఏలూరు కార్పొరేషన్ పరిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ అధికారులపై ఉంది.

– పిచ్చుక ఆదిశేషు, జిల్లా కన్వీనర్, చేనేత కార్మిక సంఘం

ఆశ్రం సెంటర్‌లో డ్రోన్లతో తనిఖీ



ఆశ్రం సెంటర్‌లో డ్రోన్లతో పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు నగరం, చుట్టపక్కల ప్రాంతాల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఏలూరు శివారు ఆశ్రం హాస్పిటల్ సెంటర్‌లో డ్రోన్లను ఎగురవేసి సీసీ కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీస్తూ అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టారు. ఆశ్రం సెంటర్ ప్రాంతంలో నేరస్తులకు అడ్డాగా మారుతుందనే అభియోగాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో నిఘా పెట్టారు. స్థానికంగా ప్రజలకు ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని, ఫిర్యాదు చేసిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డ్రోన్ల సాయంతో ప్రధాన రహదారులు, హైరిస్క్ జోన్లలో పరిస్థితిని పరిశీలిస్తున్నామని తెలిపారు.

ఉత్సాహం నింపిన ఎక్స్‌పోజర్ యాత్ర



హైదరాబాద్ గోల్కొండలో ఏలూరు జిల్లా విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వివిధ ప్రాంతాలు, భిన్న సంస్కృతుల పట్ల అవగాహన కలిగించేందుకు నిర్వహించిన ఎక్స్‌పోజర్ యాత్ర విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపిందని జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజులు తెలిపారు. ఈ నెల 15వ తేదీ రాత్రి ఏలూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు, గైడ్ టీచర్లు కలిపి 252 మంది ఆర్టీసీ బస్సులలో బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకున్నామన్నారు. గురువారం ఉదయం గోల్కొండ కోట, బిర్లా ప్లానిటోరియం, బిర్లా మ్యూజియం, బిర్లా మందిర్, సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్ బండ్ తదితర స్థలాలను సందర్శించామని వివరించారు. రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం ఏలూరు కేపీడీటీ హైస్కూల్‌కు చేరుకున్నామన్నారు. ఈ యాత్రకు సహకరించిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, గైడ్ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓపెన్ హార్ట్ సర్జరీ విజయవంతం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నగరంలో మొట్టమొదటిసారిగా ఎన్‌టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) ద్వారా నిర్వహించిన ఓపెన్ హార్ట్ సర్జరీ దిగ్విజయంగా జరిగిందని గుండె వైద్యనిపుణుడు రితేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక విజయ హాస్పిటల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు పరిసర ప్రాంతాల ప్రజలకు నగరంలో ఇప్పటి వరకూ ఓపెన్ హార్ట్ సర్జరీ చేసే ఆసుపత్రిలేదని, ప్రస్తుతం తమ ఆసుపత్రిలో ఎన్‌టీఆర్ వైద్య సేవ ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చులేకుండా ఓపెన్ హార్ట్ సర్జరీని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. గత మూడేళ్లలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా సుమారు 2 వేలకు పైగా స్టెంట్‌లు వేశామని, 3 వేలకు పైగా యాంజియోగ్రామ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించామని వివరించారు. శస్త్రచికిత్స చేయించుకున్న సీహెచ్ వెంకన్న మాట్లాడుతూ తాను నగరంలో చిన్న కూల్‌డ్రింకుల దుకాణం నడుపుకుంటున్నానని, డాక్టర్ రితేష్ పైసా ఖర్చులేకుండా శస్త్రచికిత్స చేస్తానని హామీ ఇచ్చి తనకు పునర్జన్మ ఇచ్చారని వివరించారు.

ఏపీజీఈఏ తాలూకా యూనిట్ కార్యవర్గం ఎన్నిక

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జంగారెడ్డిగూడెం తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ ఎన్నికల్లో తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా మలేరియా సబ్ యూనిట్ అధికారి వెలివెల పెద్దిరాజు, కార్యదర్శిగా పి.ఫణీంద్రబాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్‌బాజీ షహీద్ బాబా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెన్నా భానుప్రకాష్, ట్రెజరర్‌గా ఎం సువర్ణ, సంయుక్త కార్యదర్శులుగా అనిపూడి వెంకటేశ్వరరావు, ఎస్‌వీ సుబ్బారావు, పి.చినబాబు, కె.సాంబశివరావు, టి.గురవమ్మ, ఉపాధ్యక్షులుగా కొప్పుల సత్యనారాయణ, కె.మధుసూధనరావు, కె.రాజ్యలక్ష్మి, టి.మణిదివ్య, కె.వసంతరావులు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి ఎస్ఎస్‌వీ రామకృష్ణరావు ఎన్నికల అధికారిగా, ఉపాధ్యక్షుడు ఎం కిరణ్ సహాయ అధికారిగా వ్యవహరించారు.

నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

కామవరపుకోట: నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం పోలీసు వ్యవస్థకు ఎంతో అవసరమని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ అనానరు. శుక్రవారం స్థానిక తడికలపూడి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ప్రతాప్ కిషోర్‌తో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వాహనాలు తనిఖీలు నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై, గంజాయి ముఠాల బెడద లేకుండా చర్య తీసుకోవాలని స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు.

హామీలను అమలు చేయాలి

భీమడోలు: కూటమి ప్రభుత్వం రైతులు, కౌలు రైతులకు గుప్పించిన హామీలన్నింటిని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. గుండుగొలను, పాతూరు గ్రామాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు, కౌలు రైతుల వద్దకు సీపీఎం బృందం సభ్యులు శుక్రవారం వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతులకు రైతు భరోసా డబ్బులు తక్షణమే అందించాలని, కౌలు గుర్తింపు కార్డులో యాజమాని అంగీకరించాలన్న నిబంధనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందుగా కూటమి పార్టీలు కౌలు రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కె.వెంకటేశ్వరరావు, కౌలు రైతులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	22	చిక్కుడు కాయలు	00
వంకాయలు (కాంతులు)	28	బిళ్లచిక్కుడు	70
వంకాయలు (తెలుపు)	28	చామదుంపలు	54
బెండకాయలు	28	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	76
కాకర కాయలు	30	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	18	అల్లం	60
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07–10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	19
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే



ఏలూరు అమీనాపేటలో అమలోద్భవి చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ



ఏలూరు మన్నా చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

- భక్తిశ్రద్ధలతో శిలువ యాత్ర
- ప్రత్యేక ప్రార్థనలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): త్యాగానికి ప్రతీకగా గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహిస్తామని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు తెలిపారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఏలూరు నగరంలోని క్రైస్తవ ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు శిలువ మోస్తూ ర్యాలీలు నిర్వహించారు. క్రైస్తవ గీతాలాపన చేశారు. స్థానిక అమలోద్భవి కథీడ్రల్‌లో ఉదయం శిలువ మార్గం, అనంతరం కృపార్చన ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం సెయింట్ థెరిస్సా హైస్కూల్ నుంచి కథీడ్రల్ ఆలయం వరకు శిలువ మార్గం నిర్వహించారు. అనంతరం కథీడ్రల్ ఆవరణలో శిలువ ఆరాధనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు మాట్లాడుతూ ఏసు బోధనలను అనుసరించి శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విచారణ గురువు ఫాదర్ మైఖేల్ ఇంజమూల పాల్గొన్నారు. నగరంలోని ఐసీఎం, ఆర్‌సీఎం, సీఎస్ఐ, సాల్వేషన్ ఆర్మీ, సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమీనాపేట, వంగాయగూడెం, శాంతి నగర్, సత్రంపాడు, ఇజ్రాయేలు పేట, ఫిల్‌హౌస్ పేట, అరుంధతీ పేట, గొల్లాయగూడెం, వైఎస్ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో శిలువ యాత్ర నిర్వహించారు. విచారణ గురువులు, పాస్టర్లు, యవ్వనస్తులు, మత కన్యలు, విశ్వాసులు శిలువలు, కొవ్వొత్తులతో పాల్గొన్నారు.

పొరుగువారి తప్పులను క్షమించండి

పొరుగువారి తప్పులను క్షమించడం ద్వారా ప్రపంచ శాంతిని స్థాపించగలమని ఆర్‌సీఎం సంఘ కాపరి తోట ఎడ్వర్డ్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా నగరంలో క్రీస్తు శిలువ యాత్రలో ఆయన మాట్లాడారు. సంఘ పెద్దలు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం సమీపంలో ఉన్న సెయింట్ మైఖేల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ మైఖేల్ చర్చి ఫాదర్ ఆరోన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు సూచించిన బోధనలను ప్రతి ఒక్కరు అనుసరించాలని సూచించారు. దైవజనులు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్ మండలంలో..

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ తోట అంథోని రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంథోని రాజు శిలువను భుజంపై పెట్టుకుని నిర్దేశించిన ఏడు స్థలాల్లో యేసు క్రీస్తు పలికిన ఏడు మాటలను వివరించారు. గీతాలాపన చేసుకుంటూ అన్ని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రత్తికోళ్ల లంకలో బైబిల్ మిషన్ చర్చిలో పాస్టర్ శ్యామ్ పాల్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిలువ మోస్తున్న ఫాదర్ ఆంథోనిరాజు



శిలువతో చిన్నారి



ఏలూరులో ర్యాలీలో పాల్గొన్న విశ్వాసులు, యువతులు



శిలువతో విద్యార్థులు



నగరంలో శిలువ యాత్ర నిర్వహిస్తున్న ఆర్‌సీఎం సంఘ కాపరి



సెయింట్ మైఖేల్ చర్చిలో ప్రార్థన చేస్తున్న ఫాదర్ ఆరోన్

కార్పొరేషన్ అభివృద్ధికి రూ.949.41 కోట్ల అంచనాలు



ఆర్థిక సంఘం చైర్మన్ పన్ గారియాకు నివేదిక అందిస్తున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ అభివృద్ధికి రూ.949.41 కోట్లు అవసరమని మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. ఈ మేరకు నివేదికను 16వ ఆర్థిక సంఘం చైర్మన్, కమిటీ సభ్యులతో తిరుపతిలో జరిగిన సమావేశంలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పన్ గారియాకు వినతి పత్రం అందజేశామని పేర్కొన్నారు. కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని పన్ గారియా, సభ్యులు అన్నే జార్జ్ మాథ్యు, డాక్టర్ మనోజ్ పాండాను కోరినట్టు తెలిపారు. నగర పాలక సంస్థలో కలిసిన ఏడు పంచాయతీలకు పూర్తిసామర్థ్యంతో మంచినీరు అందించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, పైప్ లైన్ల ఏర్పాటుకు రూ.24.56 కోట్లు, పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణకు ఏటా రూ.3 కోట్లు అవసరమని పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల అమలుకు 15 ఎంఎల్డి సామర్థ్యం గల చెరువు నిర్మాణానికి రూ.119 కోట్లు, నగరం, విలీన పంచాయతీల్లో 48 కిలో మీటర్ల కొత్త రోడ్ల నిర్మాణం, 95 కిలో మీటర్ల రోడ్ల మరమ్మతులకు రూ.474.10 కోట్లు అంచనా వేశామని వివరించారు. 420 కిలో మీటర్ల డ్రెయిన్ నిర్మాణానికి రూ.157.85 కోట్లు అవసరమని తెలిపారు. తంగెళ్లమూడి వద్ద ఉన్న సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నెట్వర్క్ సిస్టంకు రూ.45 లక్షలు, నగరం, పంచాయతీలోల పార్కులకు రూ.10 కోట్లు అంచనాలు రూపొందించామని పేర్కొన్నారు. నగరంలోని 50 షాపింగ్ కాంప్లెక్సు పునర్నిర్మాణానికి రూ.2 కోట్లు అంచనా వేశామని వివరించారు. కార్పొరేషన్, సచివాలయ భవనాలపై సోలార్ సిస్టం ఏర్పాటుకు రూ.60 లక్షల అంచనాలు తయారు చేశామని తెలిపారు.